చేగుంట పురవిధుల్లో 108 కలశాలతో ఊరేగింపు

వైభవంగా కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం

- 108 కలశాలతో అమ్మవారి ఊరేగింపు

చేగుంట, జూన్ 21: చేగుంటలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ 19వ వార్షికోత్సవాన్ని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. హనుమాన్ దేవాలయం నుంచి అమ్మవారికి పల్లకీ సేవ, 108 కలశాలతో ఊరేగింపు, అమ్మవారికి మహాభిషేకం, కోటి దీపాలంకరణ సేవ, హోమం, భజన సంకీర్తన, తీర్థ ప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు తొడుపునూరి నగేశ్, చేగుంట మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, ఎంపీటీసీ అయిత వెంకట లక్ష్మీ రఘురాములు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు అయిత పరంజ్యోతి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఇమ్మడి లక్ష్మణ్, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యనందించాలి

కలెక్టర్‌ను శాలువాతో సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

- కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 21: విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మకమైన విద్య అందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బడిబాట సాంగ్ రూపొందించిన కలెక్టర్‌ను డీఈవో రాధాకిషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు శుక్రవారం కలెక్టర్‌ను ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలుచేయడంతో పాటు క్షేత్రస్థాయిలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యమైన విద్యాబోధన చేసేందుకు ప్రణాళికాబద్ధంగా వెళ్లాలని సూచించారు.

తహసీల్ కార్యాలయానికి స్థల పరిశీలన

నిజాంపేటలో తహసీల్ కార్యాలయ స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నిజాంపేట, జూన్ 21: నిజాంపేటలో తహసీల్ కార్యాలయం కోసం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు శుక్రవారం స్థల పరిశీలన చేశారు. శిథిలావస్థకు చేరిన అద్దె ఇంట్లో తహసీల్ కార్యాలయం కొనసాగుతున్నదని, గ్రామంలోనే వేరే చోట కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఆర్ఐ గంగాధర్‌గౌడ్, శ్రీకాంత్ ఉన్నారు.

అర్హులకు 'డబుల్' ఇండ్లు ఇవ్వాలని రాస్తారోకో

తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పేదలు

రామాయంపేట, జూన్ 21: తమకు డబుల్ బెడ్‌రూమ్‌లు ఇండ్లు ఇవ్వాలంటు పేదలు శుక్రవారం తహసీల్ కార్యాలయం ఎదుట ఆందోళన, జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై రంజిత్ ధర్నాను విరమింప జేయాలని కోరారు. లబ్ధిదారులు వినకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించి సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు.

నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలి

ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గోవింద్

అల్లాదుర్గం, జూన్ 21: నాణ్యమై విత్తనాలను అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ అన్నారు. శుక్రవారం మండలంలోని గడిపెద్దాపూర్‌లో పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం అధికారులు నమోదు చేసిన పంటల వివరాలు పరిశీలించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డీలర్లకు హెచ్చరించారు. ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని సూచించారు. ఆయనతో ఏవో రాజేశ్, ఏఈవో అమృత్ ఉన్నారు.

కలెక్టర్ ఆదేశాలతో మట్టిని వేలంవేస్తాం

శివ్వంపేట, జూన్ 21: అక్రమంగా నిల్వచేసిన మట్టి డంపును కలెక్టర్ ఆదేశాలతో బహిరంగ వేలం వేస్తామని తహసీల్దార్ శ్రీనివాస్ చారి అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో ఇటుక బట్టీల కోసం మట్టిని అక్రమంగా రవాణా చేసి డంపు చేసినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ షఫీ యోద్దీన్‌తో కలిసి డంపు చేసిన మట్టిని నిల్వ ఉంచిన ప్రాంతాన్ని పరిశీలించారు. మట్టి ఎవరిదని ఆరా తీశారు. అనుమతులు లేకుండా మట్టిని డంపు చేసిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు నిల్వ చేసిన మట్టిని కలెక్టర్ అనుమతితో వేలంపాట నిర్వహిస్తామని తెలిపారు. మండలంలో అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమంగా మట్టి రవాణా చేస్తే సహించేది లేదని, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొత్తపేట శివారులో అక్రమ మట్టి డంపును పరిశీలిస్తున్న తహసీల్దార్

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు
- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 21: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, శారీరక రుగ్మతలు దూరమవుతాయని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జిల్లా యువజన, క్రీడల శాఖ, వశిష్ట యోగా కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు, యోగా గురువు రవి, దేవేందర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాస్ చంద్రగౌడ్, నెహ్రూ యువ కేంద్ర కో ఆర్డినేటర్ కిరణ్ పాల్గొన్నారు.

మెదక్ మున్సిపాలిటీ: యోగా గురువులతో కలిసి యోగాసనాలు వేస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

నర్సాపూర్ కోర్టు ఆవరణలో యోగా దినోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి అనిత



రామాయంపేటలో యోగా గురువులకు సన్మానం చేస్తున్న పట్టణవాసులు

చేగుంటలో యోగలో పాల్గొన్న రాష్ట్ర యోగ కోచ్ కరణం గణేష్‌రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

శివ్వంపేట ప్రభుత్వ పాఠశాలలో యోగా ఆకారంలో విద్యార్థులు

పెద్దశంకరంపేటలో యోగా చేస్తున్న ఆచార్యులు, పాల్గొన్న సరస్వతీ శిశుమందిర్ విద్యార్థులు

తూప్రాన్ పట్టణంలోని గీతా స్కూల్లో యోగాసనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు

నీట్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

- ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్ మున్సిపాలిటీ/నర్సాపూర్, జూన్ 21: నీట్ పరీక్ష లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం నర్సాపూర్‌లో నీట్ విద్యార్థులకు న్యాయం జరగాలని ధర్నా చేసి ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు ఆవుల రాజిరెడ్డి, సుహాసినిరెడ్డి, రవీందర్‌రెడ్డితో కలిసి నర్సాపూర్, జిల్లా కేంద్రం మెదక్‌లోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 24 లక్షల మంది నీట్ పరీక్ష రాస్తే 67 మందికి మొదటి ర్యాంక్ రావడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే కారణమన్నారు. నీట్ పరీక్ష పత్రం లీకేజీపై క్షుణ్ణంగా విచారణ జరిపించి, లీకేజీకి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలన్నారు. ధర్నాలో మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, నాయకులు గుడూరి ఆంజనేయులు, ప్రశాంత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సిద్దిరాములు, గంగ నరేందర్ జీవన్‌రావు, మనోజ్, బొజ్జ పవన్, సుప్రభాత్‌రావు, గంగాధర్, భరత్‌గౌడ్, నాగరాజు, కౌన్సిలర్లు లింగం, లక్ష్మీనారాయణగౌడ్, కల్యాణి, దొంతి లక్ష్మి, షమీ పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో మోదీ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, నాయకులు

ప్రొఫెసర్ జయశంకర్ సార్‌కు ఘన నివాళి

మెదక్ మున్సిపాలిటీ: జయశంకర్ చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకుల నివాళి

తూప్రాన్, జూన్ 21: తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతిని తూప్రాన్‌లో శుక్రవారం నిర్వహించారు. మహనీయుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సతీశ్ చారి, ఉపాధ్యక్షుడు యాసిన్, నాయకులు మన్నె శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రం పాల్గొన్నారు.

మెదక్‌లో

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 21: ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బట్టి జగపతి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. పట్టణ ప్రధాన కార్యదర్శి కృష్ణా గౌడ్, కౌన్సిలర్లు శ్రీనివాస్, కిశోర్, నాయకులు కిషన్, నగేశ్, మహమ్మద్ పాల్గొన్నారు.

తూప్రాన్‌లో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

యూట్యూబర్‌పై మాజీ సర్పంచ్ ఫిర్యాదు

నర్సాపూర్‌లో ప్లెక్సీతో నిరసన తెలుపుతున్న మాజీ సర్పంచ్ సురేశ్‌గౌడ్, గ్రామస్తులు

నర్సాపూర్, జూన్ 21: ఓ యూట్యూబర్ తనపై బెదిరింపులకు పాల్పడుతున్నాడని మండలంలోని చిన్నచింతకుంట గ్రామ మాజీ సర్పంచ్ బుర్ర సురేశ్‌గౌడ్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూట్యూబర్ బైల్‌పాటి గణేశ్ అకారణంగా గతంలో తనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాడని, కేసు కాకుండా ఉండాలంటే తనకు రూ.50 వేలు ఇవ్వాలని బ్లాక్ మెయిల్ చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం గ్రామంలో ఓ పంచాయితీ చెప్పడానికి గ్రామస్తులు తనను పిలిచారని, అక్కడికి వెళ్లేసరికి బైల్‌పాటి గణేశ్ అక్కడే ఉన్నాడని, పైగా తనను కారణం లేకుండా ఓ మహిళతో దుర్భాషలాడించాడని తెలిపారు. గ్రామానికి చెందిన మన్నె బాలమణి అనే మహిళతో తిట్టించడమే కాకుండా పోలీస్‌స్టేషన్‌లో కులం పేరుతో తిట్టాడని తనపై వ్యతిరేకంగా ఫిర్యాదు చేయించాడని ఆవేదన వ్యక్తం చేశారు. యూట్యూబర్ గణేశ్ నుంచి ఆత్మరక్షణ కల్పించి, తనకు, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. అదే గ్రామానికి చెందిన గుడ్డి రాములు కూడా తనను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని, వీరి నుంచి రక్షణ కల్పించాలని మాజీ సర్పంచ్ కోరారు.

మెదక్ బస్ డిపో ఎదుట నిరసన చేస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు

డీఎం వేధింపులు భరించలేకపోతున్నాం

మెదక్ బస్ డిపో ఎదుట ఆర్టీసీ డ్రైవర్ల నిరసన

మెదక్ అర్బన్, జూన్ 21: మెదక్ ఆర్టీసీ డీఎం, సీఐ వేధింపులు భరించలేకపోతున్నామని 60 మంది డ్రైవర్లు విధులు బహిష్కరించి, డిపో ఎదుట శుక్రవారం నిరసన చేశారు. ఈ సందర్భంగా డ్రైవర్లు మాట్లాడుతూ.. టిమ్స్ డ్యూటీ చేయాలని నెల రోజుల నుంచి డిపో మేనేజర్, సీఐ వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్యం బారిన పడినా కనికరించకుండా పని చేయిస్తున్నారన్నారు. సమస్యలు పరిష్కరించాలని వారం కిందట డీఎంకు నోటీసులు అందజేశామన్నారు. హోటల్‌లో భోజనం చేసి డిపోలో పడుకుని డ్యూటీ చేస్తున్నామన్నారు. వెంటనే ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఖర్జూర పంటతో అధిక లాభాలు

రామాయంపేట, జూన్ 21: ఖర్జూర పంట సాగు చేస్తే 80 ఏండ్ల వరకు దిగుబడినిస్తుందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నర్సయ్య పేర్కొన్నారు. రామాయంపేట శివారులోని జాతీయ రహదారి పక్కన రైతు సత్యనారాయణ 13 ఎకరాల్లో ఖర్జూర పంట సాగు చేస్తున్నాడు. ఈ పంటను ఉద్యానవన శాఖ అధికారి నర్సయ్య, శాస్త్రవేత్తలు, మరో 50 మంది ఆదర్శ రైతులు శుక్రవారం పరిశీలించారు. పంట దిగుబడి వాటికయ్యే ఖర్చు వివరాలు, పంట విత్తిన రైతు సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. ముందుగా రైతు మాట్లాడుతూ తనకున్న 14 ఎకరాల్లో 13 ఎకరాలు చదును చేసి ఖర్జూర పంట వేశానన్నాడు. ఖర్జూరపు మొక్కలను ఇంగ్లాండ్, ఇరాన్, ఇరాక్ దేశాల నుంచి తీసుకొచ్చి పం ట వేశానన్నాడు. తెలంగాణలో ఉన్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా బరిహి అనే రకం మొక్కలు తీసుకొచ్చి నాటినట్లు తెలిపాడు. ఈ మొక్కలు ఇక్కడి వాతావరణానికి అనుకూలంగా ఉంటాయన్నారు. 13 ఎకరాల్లో ఖర్జూర పంట కోసం దాదాపు రూ.10 కోట్ల వరకు పెట్టుబడి పెట్టానని తెలిపాడు. ఈ రకం మొక్కలు ఒక్కసారి నాటితే దాదాపు 80 ఏండ్ల వరకు కాపుకాసి దిగుబడినిస్తాయన్నాడు. ఈ ఖర్జూరపు పంటను సేంద్రియ ఎరువులు, జీవామృతం పద్ధతుల్లో నాటడం తో ఎంతో రుచిగా ఉంటాయని తెలిపాడు. అనంతరం జిలా ఉద్యానవనశాఖ అధికారి నర్సయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి క్షేత్రస్థాయి పర్యటనకు పంటను పరిశీలించడం కోసం 50 మంది రైతులు రామాయంపేటకు చేరుకుని పంటను పరిశీలించారన్నారు. రాష్ట్రంలోనే రామాయంపేటకు చెందిన రైతు సత్యనారాయణతో పాటు జనగామ జిల్లాలోని రఘునాథపల్లి గ్రామానికి చెందిన రైతు 5ఎకరాల్లో ఖర్జూర పంట సాగు చేశాడని తెలిపారు. రైతులందరూ ఇలాంటి వినూత్నమైన పంటలు విత్తుకుంటే అధిక లాభాలను గడించవచ్చన్నారు. పంట పరిశీలన కోసం శాస్త్రవేత్తలు డాక్టర్ శంభాజీ, డాక్టర్ శ్రీకాంత్, రామాయంపేట వ్యవసాయశాఖ అధికారి రాజ్‌నారాయణ, రచన, సంతోష్ తదితరులు ఉన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖ అధికారి నర్సయ్య

ఇంగ్లీష్ గెస్ట్ లెక్చరర్ దరఖాస్తు ఆహ్వానం

చేగుంట, జూన్ 21: తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల చేగుంటలో పీజీటీ ఇంగ్లీష్ బోధించేందుకు అతిథి అధ్యాపకులకు దరఖాసులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భూపాల్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఎంఏ (ఆంగ్లం litt)తో పాటు బీఈడీ కలిగి, అనుభవం, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ వరకు కళాశాలలో సంప్రదించగలరని తెలిపారు.

ఏఎన్ఎం పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రామాయంపేట, జూన్ 21: టీఎస్ మాడల్ స్కూల్ వసతి గృహంలో పనిచేసేందుకు అర్హులైన ఏఎన్ఎంలు దరఖాస్తు చేసుకోవాలని కేజీబీవీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అనురాధ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రామాయంపేటలోని అర్హులైన అభ్యర్థులు కోమటిపల్లి గ్రామ శివారులో ఉన్న టీఎస్ మాడల్ స్కూల్ హాస్టల్‌లో ఏఎన్ఎంగా పనిచేసేందుకు ఈ నెల 24వ తేదీలోపు దరఖాస్తులను నేరుగా అందజేయాలన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, ఏఎన్ఎం శిక్షణ పొంది ఉన్నవారు తమ కులం సర్టిఫికెట్‌తో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సెలక్ట్ అయినవారికి నెలకు జీతం రూ.7800 ఇవ్వనున్నట్లు తెలిపారు.

గ్రామాభివృద్ధికి కృషి చేస్తా

మాట్లాడుతున్న డాక్టర్ రామకిష్టయ్య

రామాయంపేట, జూన్ 21: గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని మాజీ సర్పంచ్, బొక్కల డాక్టర్ మానెగల్ల రామకిష్టయ్య అన్నారు. శుక్రవారం గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామంలో ఏ అవసరమున్నా తాను ముందుంటానన్నారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న గ్రామస్తులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రామాయంపేట, జూన్ 21: మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎండీవో షాజుల్లిద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు హాజరు కానున్నారని, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

కూలి పనికి వచ్చిన వ్యక్తి మృతి

మెదక్ అర్బన్, జూన్ 21: కూలి పని కోసం వచ్చి గేట్ పిల్లర్ స్తంభం మీద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మెదక్ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల వద్ద శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రెడ్యాతాండకు చెందిన ఫకీరా నాయక్(45) మెదక్ పాటిటెక్నిక్ కళాశాలలో కూలి పనికోసం వచ్చాడు. పని చేస్తున్న క్రమంలో గేట్ పిల్లరు మీద పడి తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మొక్కలు పెంచడంలో నిర్లక్ష్యం వహించొద్దు

పార్కును పరిశీలిస్తున్న పురపాలిక చైర్మన్ జితేందర్‌గౌడ్

రామాయంపేట, జూన్ 21: మొక్కలు పెంచడంలో నిర్లక్ష్యం వహించొద్దని పురపాలిక చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ అన్నారు. శుక్రవారం కోమటిపల్లిలోని యాదాద్రి పార్కును సందర్శించారు. యదాద్రి పార్కులో గతేడాది 4వేల మొక్కలు నాటితే 3500 మొక్కలు బతికాయన్నారు. పార్కులో వాటర్ యాపిల్, దానిమ్మ, సపో టా, నిమ్మ, పనస, అల్లనేరేడు, సీతాఫలం తదితర మొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు. చైర్మన్ వెంట చల్మెడ ప్రసాద్, నరేశ్, అర్జున్ ఉన్నారు.

ఆఫ్ లైన్‌లోనే టీచర్ల బదిలీలు చేపట్టాలి

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 21: టీచర్ల బదిలీలు ఆఫ్ లైన్‌లో చేపట్టాలని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మల్లారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు త్యార్ల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా ఆప్షన్స్ ఇవ్వడం ఇబ్బందికి గురి చేస్తున్నదన్నారు. సీనియారిటీ లిస్టులో 1000 నంబర్ ఉన్న ఉపాధ్యాయులు 1000 ఆప్షన్స్ ఇవ్వడంతో గందరగోళానికి గురయ్యే ఆస్కారం ఉందని, బదిలీలను ఆఫ్‌లైన్‌లో నిర్వహించి న్యాయం చేయాలని కోరారు.